ప్రజాశక్తి
ఆదివారం 4 మే 2025
5
అల్లూరి సీతారామరాజు



రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని టోకూరు, కోనపురం పంచాయతీకి చెందిన రైతులకు వ్యవసాయ పనిముట్లను సర్పంచులు కిల్లో. మొస్య, అప్పలమ్మలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వ్యవసాయ పనులలకు దుక్కెటద్దులు లేని రైతులను గుర్తించి ఏడు పవర్ ఈడర్లను అందజే యడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సార దొన్ను, నాయకులు జి.రఘునాథ్ పాల్గొన్నారు.



పనిముట్లు ఇస్తున్న సర్పంచ్

రెండో రోజూ బంద్ సక్సెస్

- ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం పట్టువిడువని గిరిజనం
- ఎక్కడికక్కడ ఆందోళనలు, నిరసన ర్యాలీలు
- నిలిచిన రవాణా వ్యవస్థ- మూతపడిన దుకాణాలు, హోటళ్లు, పర్యాటక కేంద్రాలు
- పాడేరులో కలెక్టర్ కారు అడ్డగింత



పాడేరులో బోసిపోయిన ఆర్టీసీ కాంప్లెక్స్



అరకులోయలో నిరసన చేపడుతున్న సురేంద్ర, తదితరులు

ప్రజాశక్తి - పాడేరు: స్పెషల్ డిఎస్సి సాధన కోసం చేపట్టిన తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ రెండో రోజైన శనివారమూ అదే ఉధృత స్ఫూర్తితో కొనసాగింది. మన్యప్రాంతం పూర్తిగా స్తంభించింది జనసంచారం నిలిచిపోయింది. వాహనాలు కదల్లేదు. పాడేరు పట్టణంలో స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ప్రతినిధులు సెంటెన్స్ కాన్వెంట్ జంక్షన్ వద్ద, ఐటీడీఏ వద్ద రోడ్డుపై బైఠాయించారు. మార్కెట్లు పూర్తిగా బంద్ అయ్యాయి. చెక్ గేట్ వంట్లమామిడి, మినుములూరు ప్రాంతాల్లో వంటా వార్పు కార్యక్రమాలు నిర్వహించారు. స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని, ప్రభుత్వం స్పందించే వరకు తమ ఆందోళన ఆగదని రోడ్డుపై బైఠాయించి నినదించారు. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సభ్యులు అప్పలనర్స, అరకు ఎంపీ తనూజారాణితోపాటు పాడేరు, అరకు మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, శెట్టి పాల్గుణ బంద్‌లో పాల్గొని రోడ్డుపై బైఠాయించారు.



అనంతగిరిలో బైఠాయించిన నాయకులు

జిల్లా కలెక్టర్ వాహనం అడ్డగింత

తన నివాస గృహం నుంచి కార్యాలయానికి బయలుదేరి వెళుతున్న జిల్లా కలెక్టర్‌ను తలార్ సింగి సమీపంలో రోడ్డుపైనే బైఠాయించి ఉన్న బంద్ నిర్వాహకులు అడ్డగించారు. స్పెషల్ డిఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పోలీసులు బంద్ నిర్వాహకులను రోడ్డుపై నుంచి అడ్డు తొలగించి ఏకలెక్టర్‌ను దారి ఇచ్చే ప్రయత్నం చేస్తున్న క్రమంలో జిల్లా కలెక్టర్ తన వాహనం దిగి బంద్ నిర్వాహకుల వద్దకు వచ్చారు. ప్రభుత్వం నుంచి, గిరిజన సంక్షేమ మంత్రి నుంచి డిఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులతో చర్చించాలని తనకు సందేశం వచ్చిందని, ఈ మేరకు డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు తన కార్యాలయానికి చర్చలకు రావాలని జిల్లా కలెక్టర్ వారిని ఆహ్వానించారు.



ముంచంగిపుట్టులో...

అనంతరం కలెక్టర్‌తో డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు చర్చలు జరిపారు. రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు మెగా డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రధాన డిమాండ్‌ను కలెక్టర్ ముందు ఉంచారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ ప్రకటించి, నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ అమలు చేయాలని కలెక్టర్‌కు డీఎస్సీ సాధన కమిటీ నాయకులు అప్పలనర్స, మాణిక్యం తదితరులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ డిఎస్సి అంశంపై లీగల్ ఒపీనియన్ తీసుకొని ముఖ్యమంత్రితో చర్చలు నిర్వహించి, పరిష్కార చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తనతో తెలిపారని వివరించారు. ప్రత్యామ్నాయ జీవో తెచ్చే విషయంపై కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలించి గతంలో లబ్ధి పొందిన వారికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం యోచిస్తోందన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో సోమవారం రాష్ట్ర స్థాయిలో చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో నేతలు తాత్కాలికంగా బంద్‌ను విరమించారు

పాడేరు టౌన్: ఏజెన్సీ ప్రాంత పోస్టులను గిరిజన స్పెషల్ డిఎస్ సి ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పాడేరులో గిరిజన స్పెషల్ డిఎస్ సి సాధన కమిటీ నిర్వహించిన రెండో రోజు బంద్‌ను ఆదివాసీ యువత అధిక సంఖ్యలో పాల్గొని బంద్ విజయవంతం చేశారు. పట్టణంలోని సెయింటాన్స్ కూడలి, తలారిసింగి కూడలి, వంతాడపల్లి చెక్ గేట్, ఆర్ టిసి కాంప్లెక్స్ వద్ద గిరిజనులు రహదారులపై బైఠాయించారు. దుకాణాలు, హోటల్లు, పెట్రోల్ బంకులు పూర్తిగా మూతపడ్డాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ కు సహకరించారు. ఉదయం 5 గంటల నుంచే ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి బంద్ నిర్వహించారు. రహదారిపై రోడ్డుకు అడ్డంగా వాహనాలు, కర్రలు కట్టి రాకపోకలను అడ్డుకున్నారు. ఆర్ టిసి బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఆటోలు రోడ్డెక్కలేదు. నిత్యం జనంతో రద్దీగా ఉండే పాడేరు అంబేద్కర్ సెంటర్, పిఎంఆర్ సి జంక్షన్, ఆర్ టిసి కాంప్లెక్స్ బోసిపోయింది. రహదారులు నిర్మానుష్యంగా మారాయి.

చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

అరకులోయ రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకులో రా కదలిరా ఎన్నికల సభలో గిరిజనులకు వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత టీడీపీ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చడం ఎంతవరకు సమంజసమని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రశ్నించారు. శనివారం ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ, అఖిలపక్షం ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో చేపట్టిన రెండోవ రోజు బంద్ కొనసాగించారు. దీంతో, ప్రముఖ పర్యాటక కేంద్రాలు పద్మావతి గార్డెన్, గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియం మూతబడ్డాయి. వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. వ్యాపార సముదాయం మూతపడ్డాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకులోయ మండల కేంద్రంలో రెండో రోజు బంద్‌ను మద్దతుగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జీ ఓ నెం పునరుద్ధరణ చేసి ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో డిగ్రీలు, బీఈడీ, పీజీలు చదివి వేలాది సంఖ్యలో ఆదివాసి నిరుద్యోగులు ఉన్నారన్నారు.చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే భవిష్యత్తులో ప్రజలు ప్రభుత్వానికి తగిన బుద్ధి గిరిజనులు చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్బీ పోతురాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు జీవన్, ఆదివాసి పరిరక్షణ సమితి అధ్యక్షుడు మోహన్, డిఎల్ఓ నాయకులు ప్రసన్నకుమార్, ఆదివాసి గిరిజన సంఘం నేతలు జగన్నాధం, మగ్గన్న సహదేవ్, డీఎస్సీ సాధన కమిటీ నాయకులు రమేష్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ:లో వైయస్సార్సీపీ ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం బంద్‌లో పాల్గొన్నారు.టౌన్షిప్ లో వైఎస్ఆర్సిపి శ్రేణులు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. స్థానిక వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసి బంద్ పాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పి.శాంత కుమారి, ఎంపిటిసిలు సర్పంచులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలో బంద్ విజయవంతమైంది. దుకాణాలు, పెట్రోల్ బంక్ మూతపడ్డాయి.సిపిఎం, వైసిపి, పలు గిరిజన సంఘాల నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. మండల పరిధిలో గూడ, ఉప్ప, ఒల్డా, సంతరి, బాకూరు, కామయ్య పేట తోపాటు పలు గ్రామాలలో గిరిజన నిరుద్యోగ యువత బైఠాయించారు.మండల కేంద్రంలో వారపు సంత జరగలేదు.మండల కేంద్రంలో మోదకొండమ్మ గుడి వరకు ర్యాలీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్ కొండలరావు, గిరిజన సంఘం మహిళా అధ్యక్షురాలు ఎస్ హైమావతి, మండల కార్యదర్శి టి కృష్ణారావు, డివిఎఫ్ నాయకులు, కడిగొం సర్పంచ్ రంజిత్ కుమార్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు కె పొట్టి బాబు, యుటిఎఫ్ నాయకులు కె రాజారావు, ఏపిటిఎఫ్ నాయకులు ప్రభాకర్, టిడబ్ల్యూ నాయకులు రాజారావు, బాలాజీ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు :మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం నేతలు, ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ, వివిధ ప్రజాసంఘాల నేతలు, పలు పార్టీ నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద అల్లూరిహారాన్ని భుజస్తూ వినూత్న నిరసన తెలిపారు. మండల కేంద్రంలో వారపు సంతలో వ్యాపార లావాదేవీలు పూర్తిగా స్తంభించాయి. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను, ఐద్వా మండల అధ్యక్షురాలు ఈశ్వరి, మండల కమిటీ సభ్యులు దాసుడు, సిపిఎం మండల కమిటీ సభ్యుడు కోర్ర త్రినాథ్, భీమరాజు, లైకాన్, వైసీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, కాంగ్రెస్ విద్యార్థి కార్యవర్గ ప్రెసిడెంట్ వెంకట జగన్ పాల్గొన్నారు.



పాడేరులో నినాదాలు చేస్తున్న అప్పలనర్స, తదితరులు

అనంతగిరి:మండలంలో బంద్ కొనసాగింది.కాశీపట్నం, అరకు మెయిన్ రోడ్డులో బైఠాయించి ఆందోళన చేపట్టారు. వాహనాలను అడ్డగించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ శెట్టి. నీలవేణి మాట్లాడుతూ,తక్షణమే స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని, జీవో 3పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి జీవోను పున్నరుద్ధరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ టి.మిత్తుల, అశోక్, సర్పంచ్ పి.అప్పారావు, పార్టీ మండల అధ్యక్షులు కె. సూర్యనారాయణ పాల్గొన్నారు

కించుమండలో అర్ధ నగ్న ప్రదర్శన

దుంబ్రిగుడ: మండలంలో రెండవ రోజు కూడా బంద్ జరిగింది. ఈ సందర్భంగా కించుమండలో గిరిజనులు, నిరుద్యోగ యువత రోడ్డుపై బైఠాయించి అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. అరకు వారపుసంత, కించుమండలో దుకాణాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఈ కార్యక్రమంలో గిరిజనులు నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో బంద్ కొనసాగింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు సన్నిబాబు మాట్లాడుతూ, ఏజెన్సీలో శాతశాతం ఉద్యోగాలు గిరిజనులకే దక్కాలన్నారు.ఈ కార్యక్రమంలో కొండబాబు, సీఐటీయూ నేత చెండా రామారావు, వైస్సార్సీపీ మండల అధ్యక్షులు మజ్జి చంద్రుబాబు, బొండపల్లి సర్పంచి మత్యరాజు, మాజీ ఎంపీటీసీ కృష్ణారావు, ప్రభాకర్, పలు సంఘాల నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

బంద్ తాత్కాలికంగా విరమణ

- స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలో ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులు పాటు రాష్ట్ర మన్యం బంద్ నిర్వహించిన డీఎస్సీ సాధన కమిటీ శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపిన అనంతరం బంద్ ను విరమించినట్లు ప్రకటించింది. జిల్లా కలెక్టర్ తో చర్చలు ముగిసిన అనంతరం తలారి సింగి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన సభలో డీఎస్సీ సాధన కమిటీ నాయకులు పి.అప్పలనరస, మాణిక్యం, కుడుముల కాంతారావు, రాధాకృష్ణ, జగన్ మాట్లా డుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ పై విధాన నిర్ణయం చేయాలని, నూరు శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ కోసం ఆర్డినెన్సు జారీ చేసేవరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ ద్వారా ఆదివాసులకు అన్యాయం జరుగుతుందని, నూరు శాతం రిజర్వేషన్ ఇచ్చే అవకాశం ఉన్న సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపెట్టి ఆదివాసి పోస్టులను ఇతరులతో భర్తీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరిజన సంక్షేమ మంత్రి మెగా డీఎస్సీ ద్వారా గిరిజనులకు 2000 పోస్టులు కేటాయించినట్టు ప్రకటించడం వాస్తవానికి దగ్గరగా లేదన్నారు. వాటిపై ప్రభుత్వం స్పష్టత చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులలో 100 శాతం రిజర్వేషన్ కావాలని గిరిజనులు కోరుతుంటే రూల్ ఆఫ్ రిజర్వేషన్లు కేటాయించిన పోస్టులను ఆదివాసులు కేటాయిస్తున్నట్లు గిరిజన మంత్రి ప్రకటించడం ఉద్యమాన్ని పక్క దాని పట్టించేందుకేనని వారు విమర్శించారు. సోమవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తో నిర్వహించే చర్చల్లో పలప్రదం కాకపోతే భవిష్యత్తులో వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా కలెక్టర్ తో జరిగిన చర్చలలో కొంత సానుకూలత ఉన్నా పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం ప్రకటించక పోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



దుంబ్రిగుడ మండలం కించుమండలో వినూత్న నిరసన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన రైతన్నలు

- ఏలేశ్వరం - అడ్డతీగల ప్రధాన రహదారిపై ధర్నా

ప్రజాశక్తి-అడ్డతీగల : ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతన్నలు రోడ్డెక్కారు. మండలంలోని పాపంపేట గ్రామం వద్ద ఏలేశ్వరం- అడ్డతీగల ప్రధాన రహదారి రోడ్డుపై శనివారం ధర్నా చేశారు. అడ్డతీగల మండల ఎల్లవరం పంచాయతీ పాపంపేట గ్రామంలో సుమారు 200 ఎకరాలు వరి పంట అకాల వర్షానికి తడిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. చేతికొచ్చిన పంటను ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించిన రైతులు తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అడ్డతీగల ఎస్సై వినోద్ రోడ్డుపై ధర్నా చేయడం సరికాదని వెంటనే రోడ్డును ఖాళీ చేయాలని రైతులను సముదాయించి ఆందోళన విరమించారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని రైతులు పోలీసులకు తెలియజేశారు. 120 రోజుల పాటు పండించిన పంట ఒకసారిగా తడిచిపోవడంతో రైతులు నష్టపోతున్నారని, కొనుగోలు కేంద్రం లేకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ సస్పెన్షన్

ప్రజాశక్తి-మారేడుమిల్లి : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన మండలంలోని జియం వలస పంచాయతీ కార్యదర్శి వి.కృష్ణప్రసాద్‌ను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సస్పెండ్ చేశారు. ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి కార్యక్రమాన్ని ఘనంగా జరపమని ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందు కోసం ప్రతి గ్రామ పంచాయతీకి మండలస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అయితే మారేడుమిల్లి మండలం జియం వలస గ్రామా పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ నిర్లక్ష్యం వలన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం గ్రామసభ జరగలేదు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి కృష్ణ ప్రసాద్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మండల తహశీల్దారు బాలాజీ, ఎంపిడిఒ శ్రీనివాస్ విశ్వనాథ్‌లకు, సర్పంచ్ కారం లక్ష్మి ఫిర్యాదు చేయగా ఉన్నత అధికారులకు ఎంపీడీఓ పంపిన నివేదిక పంపించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి వి కృష్ణ ప్రసాద్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

గాలివాన బీభత్సం

- వ్యవసాయశాఖ కార్యాలయంపై కూలిన భారీ మామిడి చెట్టు
- నేలకొరిగిన కరెంట్ స్తంభాలు



రాజవొమ్మంగిలో ఈదురుగాలులతో కురుస్తున్న భారీవర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి తీవ్రమైన ఎండ కాయడంతో పాటు వడగాల్పులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో నల్ల మబ్బులు కొమ్ముకొని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం సుమారు గంటసేపు కురిసింది. దీంతో ఎండ వేడిమి నుంచి మన్యంవాసులు ఉపశమనం పొందారు. అయితే గాలి వర్షానికి జీడి మామిడికి తీవ్ర నష్టం జరిగిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈదురుగాలులు కారణంగా వల్ల స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న భారీ మామిడి చెట్టు వ్యవసాయ శాఖ కార్యాలయంపై పడిపోవడంతో కార్యాలయ భవనం తీవ్రంగా దెబ్బతింది. జడ్డంగి పంచాయితీ రేవటిపాలెం గ్రామ సమీపంలో ఉన్న 33 కెవి విద్యుత్ లైన్‌లో రెండు స్తంబాలు శనివారం కురిసిన భారీ వర్షానికి పూర్తిగా పడిపోయాయి. ఇంకో స్తంభం ఒరిగిపోయింది. ఈ నేపథ్యంలో రంపచోడవరం నుండి రాజవొమ్మంగి విద్యుత్ సరఫరా వచ్చే లైన్ కావడంతో వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినట్లు ఇన్‌ఛార్జ్ ఏఇ కె.అబ్బాయిదొర తెలిపారు. స్తంభాలు పడిపోయిన ప్రాంతానికి విద్యుత్ సిబ్బంది వెళ్లి విద్యుత్ వైర్లను తొలగించారు. విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా కాకరపాడు విద్యుత్ సరఫరా తీసుకున్నట్లు ఎఇ చెప్పారు. చాలాకాలం క్రితం వేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు కావడం వల్ల తుప్పు పట్టడంతో ఈదురు గాలులకు పడిపోయాయి. వాటి స్థానే ఆదివారం నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అప్పన్నదొర, జె వరప్రసాద్, శ్రీనివాస్ దొర, ప్రకాష్, రాఘవ పాల్గొన్నారు.

గాలి బీభత్సానికి ఇంటి పైకప్పులు నేలమట్టం

కొయ్యూరు : మండలంలో శనివారం వీచిన ఈదురుగాలుల బీభత్సానికి పలు ఇళ్ల పైకప్పులు నేలమట్టమయ్యాయి. కొమ్మికపంచాయతీ పరిధి కొత్త బొర్రంపేట గ్రామంలో మర్రి అప్పారావు, మర్రి బాబురావు, మర్రి శంకర్ తదితర రైతుల ఇంటి పైకప్పు రేకులు నేలమట్టమయ్యాయి. దీంతో బాధితుల ఇంట్లో నిత్యావసర వస్తువులు, తదితర సామాగ్రి, గృహోపకరణాలు వర్షం నీటికి తడిసి పాడైపోయాయి. తమను ప్రభుత్వం ఆదకోవాలని బాధితులు కోరుతున్నారు.



కొయ్యూరు మండలం కొత్త బొర్రంపేటలో ఇంటి పైకప్పులు ఎగిరిపోయి నేలమట్టమైన దృశ్యం



అరకులో వర్షపు నీరుతో నిండిపోయిన బురద గెడ్డ

అరకులోయలో...

అరకులోయ రూరల్ : అరకులోయ మండల కేంద్రం, పరిసర ప్రాంతాలలో శనివారం మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అయ్యిన ప్రజలు మధ్యాహ్నం గంటసేపు భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. వర్షపు నీటితో రోడ్లన్ని జలమయ్యాయి. ఎండపల్లివలస, అరకు ,మద్య బురద గెడ్డ వంతెన వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు వాహన దారులు ఇబ్బంది పడ్డారు. వంతెన మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.



విరిగిపడిపోయిన విద్యుత్ స్తంభం

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం


గ్రంథాలయంలో ఆటలాడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞానశిబిరం ఉత్సాహంగా సాగుతుంది. ఐదు రోజులుగా ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు గ్రంథాలయానికి చేరుకుని సందడి చేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ఉదయానికే గ్రంథాలయానికి చేరుకుని, అక్కడ పుస్తకాలను చదవడం, వివిధ ఆటలపోటీలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పుస్తకపఠనం కలిగే ప్రయోజనాలపై లైబ్రేరియన్ వివరిస్తూ, వారితో పుస్తకాలను చదివిస్తున్నారు. తర్వాత కథల పోటీలు, వ్యాసరచన, క్విజ్, రన్నింగ్, డాన్స్, ఖోఖో, కబడ్డీ వంటి పోటీలను నిర్వహిస్తున్నారు. రోజుకొకటి చెప్పున వేర్వేరుగా ఆటలు పోటీలను నిర్వహిస్తుండడంతో విద్యార్థులు, చిన్నారులు విసుగు లేకుండా ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు. పలువురు అధికారులు, రాజకీయ నాయకులు గ్రంథాలయాన్ని సందర్శించి, నిర్వాహకులతోపాటు చిన్నారులను ఉత్తేజపరుస్తున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ,చిన్నారులు ఎండల్లో ఆరుబయట తిరగకుండా, ఏటా గ్రంథాలయాల ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న విజ్ఞానశిబిరాలు ప్రయోజనకరంగా ఉంటున్నాయని చిన్నారుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆటలపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, చిన్నారులు విజేతలకు ముగింపు సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీలో జిల్లాలో మూడోస్థానం

అరుకు అసెంబ్లీ నియోజకవర్గంలో అనంతగిరి టాప్

ప్రజాశక్తి - అనంతగిరి : ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో అనంతగిరి మండలం అల్లూరి జిల్లాస్థాయిలో మూడో స్థానంలోనూ, అరుకు నియోజకవర్గస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని స్థానిక ఎంపిడిఒ ఎవివి కుమార్ తెలిపారు. అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఒకటో తేదీన అనంతగిరి, కొత్తూరు, వాలాసి, కాశీపట్నం, పెద్దబిడ్డ, టోకూరు పంచాయతీల్లో మొదటిరోజునే శతశాతం పింఛన్ల పంపిణీని పూర్తిచేశారు దీంతో జిల్లాలో మూడోస్థానంలో నిలిచామన్నారు. అయితే రెండో తేదీన మండలం పొదుగూనా అన్ని పంచాయతీల్లో శతశాతం పూర్తి చేశామని ఎంపిడిఒ తెలిపారు. లబ్ధిదారులకు నేరుగా పింఛన్లు అందజేసిన సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి ఎంపిడిఒ అభినందనలు తెలిపారు.

ఆర్‌టిసి కొత్త బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్‌ఆర్‌టిసి కొత్తగా వచ్చిన సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను టిడిపి రాష్ట్రఅధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆర్‌టిసి విజయనగరం జోనల్ ఛైర్మన్ ఎస్.దొన్నుదొర శనివారం విశాఖ స్టీల్ సిటీ డిపోలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఆర్‌టిసి ఒకటో జోన్ పరిధిలోనిఅన్ని యూనిట్స్, డిపోలలో సుమారు రూ.30 లక్షల విలువ చేసే 63 కొత్త కంప్యూటర్స్‌ను కూడా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు కాలంలో ఆర్‌టిసి మరిన్ని బస్సులను వినియోగంలోకి తెస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెఎస్.బ్రహ్మానంద రెడ్డి, విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, విశాఖ స్టీల్‌సిటీ డిపో మేనేజర్ గౌతమ్ ఛటర్జీ, గాజువాక డిపో మేనేజర్ వి.ప్రవీణ, వర్క్‌షాప్ ఆఫీసర్ తిరుపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పివి. నరసింహారావు, అసిస్టెంట్ మేనేజర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, యూనియన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మొబిల్ అన్‌ఫర్గెటబుల్' టివిసి ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశంలో మొబిల్ బ్రాండెడ్ లూబ్రికెంట్లను మార్కెట్ చేస్తున్న ఎక్సాన్ మొబిల్ అనుబంధ సంస్థ ఎక్సాన్ మొబిల్ లూబ్రికెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 'అన్‌ఫర్గెటబుల్ జర్నీస్' ప్రచారంలో భాగంగా తన కొత్త టివిసిని విశాఖలో ప్రారంభించింది. ఎక్సాన్ మొబిల్ లూబ్రికెంట్స్ డైరెక్టర్ వార్లీ పెరీరా మీడియాతో మాట్లాడుతూ, దశాబ్దాలుగా మొబిల్‌ఆన్ అత్యంత కఠినమైన పరిస్థితులలో ప్రయోగశాలలో పరీక్షించబడి, రోడ్డుపై నడిచే, ట్రాక్-నిరూపితమైన పనితీరును నిరూపించిందన్నారు. గణనీయమైన మైలేజ్ తర్వాత ఇంజిన్లు ఇప్పటికీ అద్భుతమైన స్థితిలో ఉన్నాయన్నారు.

జిఒ3 రద్దు పాపం వైసిపిదే!

- గిరిజనులను మభ్య పెడుతున్న విపక్షం
- జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిఒ విషయంలో గిరిజనులను వైసిపి నాయకులు మభ్యపెడుతున్నారని మాజీ మంత్రి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మండిపడ్డారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 2020లో జగన్ ప్రభుత్వం వైఫల్యం కారణంగా జిఒ3 రద్దు అయిందన్నారు. దీనిపై గట్టిగా మాట్లాడే నైతిక హక్కు వైసిపి నాయకులకు లేదన్నారు. గిరిజనులకు లబ్ధి చేకూర్చే జిఒ3 ని రద్దు చేస్తుంటే వైసిపి నాయకులు ఏమిచేశారని ప్రశ్నించారు. జిఒ 3, 275లను తీసుకువచ్చి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. జిఒ3పై వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే పదవులకు రాజీనామా చేసి పోరాటం చేయాలని సూచించారు. గడచిన ఐదేళ్లలో వైసిపి పాలనలో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేకపోయారన్నారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వైసిపి నాయకుల బూటకపు మాటలను నమ్మి గిరిజనులు మోసపోవద్దని హితవు పలికారు.


పూర్తి స్థాయి అధికారులతో గ్రామసభలు నిర్వహించాలి

ప్రజాశక్తి-సీలేరు : గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావాలంటే పూర్తిస్థాయి అధికారులతో గ్రామసభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామసభలు పూర్తిస్థాయి అధికారులతో నిర్వహించేలా అల్లూరు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చర్యలు చేపట్టాలని కోరారు. పంచాయతీ పరిధిలో గ్రామసభలు నిర్వహించేటప్పుడు అన్ని శాఖల అధికారులు పాల్గొంటే సమస్యలు పరిష్కారం కావడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తుతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహించడంవలన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామస్థాయిలో అన్ని శాఖల అధికారులతో గ్రామసభలు నిర్వహించి సమస్యలు పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, మంచినీరు, రహదారులు వంటి సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

మినీ గురుకులంలో ప్రవేశానికి 20లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామంలో గల ఎపి గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశానికి, 2 నుండి 8వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బి.శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను మే 4 నుంచి 20వ తేదీ వరకు సమర్పించాలని కోరారు. గిరిజన బాలికలు మాత్రమే అడ్మిషన్ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ఖాళీల వివరాలను సంబంధించి 1వ తరగతిలో 30 సీట్లు, 2వ తరగతిలో 20 సీట్లు, 3వ తరగతిలో 19 సీట్లు, 4వ తరగతిలో 11 సీట్లు, 6వ తరగతిలో 2 సీట్లు, 8వ తరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లు కంటే అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తే చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సమక్షంలో లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన గిరిజన బాలికలు సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9603407446, 7680839935 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

వెయ్యికి ఎకరా!


File No.REV02-LM/1337/2022-DT-LA-ANKP

...uter No.12468/2022/L2/Dt: 28/04/2025 Collector's Office, Anakapalli.

...OCEEDINGS OF THE DISTRICT COLLECTOR, ANAKAPALLI
PRESENT: SMT. VIJAYA KRISHNAN, I.A.S.,
@@@

Sub : Lands – Anakapalli District & Division – Anakapalli Mandal – Kothuru H/o Thummapala Village – Allotment of Government Land admeasuring an extent of Ac.2.00cts in Sy.No.608/10 to Telugudesam Party for the purpose of District Telugudesam Party Office Building, Anakapalli on lease –Pending land allotment orders from the Govt. Advance possession given - Orders issued- Regarding.

Read 1. Representation dt:22/07/2024 of Shri Bathula Thatayya Babu, Hon'ble Chairman, AP State Housing Corporation Ltd, Anakapalli and District President, Telugudesam Party, Anakapalli District.
2. Comp No:12468/2022/L1/Dt:08/01/2025 of District Collector, Anakapalli.
3. Rc.No.141/2025/SA/Dated: 24/04/2025 of the Tahsildar, Anakapalli.
4. Rc.No.646/2025/B, dt.24.04.2025 of the RDO, Anakapalli.

@@@

ORDER:

In the reference 1st read above, Shri Bathula Thatayya Babu, District ...esident, Telugudesam Party, Anakapalli has submitted memorandum duly ...uesting for allotment of Government land measuring an extent of Ac.2.00 cts ...n Anakapalli mandal on lease basis for the purpose of TDP Party Office Building in-terms of G.O.Ms.No.340, Rev (Assn.I) Dept Dated 21/07/2016.

The Tahsildar, Anakapalli and the RDO, Anakapalli have submitted feasibility reports vide references 3rd & 4th read above respectively for the Govt. land measuring Ac.2.00 Cts in Sy.No.608-10 of Kothuru H/o Thummapala Village of Anakapalli mandal, which is stand classified as "Poramboke", free from encumbrance and suitable for allotment to the TDP ...ty for the purpose of construction of Distri... Building as stated

- టిడిపి కార్యాలయానికి రెండెకరాలు కేటాయింపు
- ప్రభు భక్తిని చాటుకున్న కలెక్టర్ విజయకృష్ణన్
- 33 ఏళ్ల పాటు లీజు
- చకచకా కదిలిన ఫైల్
- వంతపలికిన ఆర్‌డిఒ, తహశీల్దార్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయానికి రెండెకరాల భూమిని కేటాయించి కూటమి ప్రభుత్వంపై తనకున్న అభిమానాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ చాటుకున్నారు. తుమ్మపాల సర్వే నెంబర్ 608/10లో కోట్ల విలువైన పోరంబోకు భూమి రెండెకరాలను ఏడాదికి ఎకరా వెయ్యి రూపాయల చొప్పున 33 సంవత్సరాలకు లీజుకు ఇస్తూ గత నెల 28న ఉత్తర్వులు జారీచేశారు. మంత్రివర్గ ఆమోదానికి పెడితే వివాదాస్పదమవుతుందని అడ్డదారిలో టిడిపి స్థలం పొందింది. జిల్లాలో కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీ మెప్పు పొందడానికి రెండెకరాలు బహుమతిగా ఇచ్చారు. దీనికి ప్రతిగా తాము చెప్పినట్లు వింటున్న కలెక్టర్ విజయకృష్ణన్ భర్త అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న దినేష్‌కుమార్‌ను జివిఎంసి కమిషనర్‌గా తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ప్రజల ఆస్తులు అప్పనంగా ప్రయివేటు వ్యక్తులు, పార్టీలకు కేటాయించకూడదన్న నిబంధనలను పక్కనబెట్టి కూటమి ప్రభుత్వం, నాయకులను సంతృప్తిపర్చేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యల పట్ల చూపని శ్రద్ధ టిడిపి జిల్లా పార్టీకి భూమి కేటాయించడంపై కనబర్చారు. ఎపి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు 2024 జులై 22న చేసిన దరఖాస్తును అనుసరించి రెండెకరాలు కేటాయించినట్లు కలెక్టర్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు.

సాధారణ ఎన్నికల ఫలితాలు 2024 జూన్ 4న వచ్చాయి. అదే నెల 12న కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన 40 రోజులకు పార్టీ కార్యాలయ భవనం కోసం కలెక్టర్ విజయకృష్ణన్‌కు తాతయ్యబాబు దరఖాస్తు చేశారు. స్థల పరిశీలనపై 2025 జనవరి 8న కలెక్టర్ కిందికి ఆదేశాలు ఇచ్చారు. స్థల పరిశీలనలో జరిగిన జాప్యంతో పై నుంచి వచ్చిన ఒత్తిడితో ఆగమేఘాలపై 2025 ఏప్రిల్ 24న ఒకేరోజు అనకాపల్లి తహశీల్దార్, అనకాపల్లి ఆర్‌డిఒ ఆయిషా తమ పని పూర్తిచేశారు. నాలుగు రోజుల వ్యవధిలో ఏప్రిల్ 28న తుమ్మపాల సర్వే నెంబర్ 608/10లో రెండెకరాల పోరంబోకు భూమిని, ఏడాదికి ఎకరాకు వెయ్యి రూపాయల లీజుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రెండు కోట్లు పైబడివుంది. ప్రయివేటు విలువ పది కోట్లకు మించివుంది. అయినా కలెక్టర్ వాస్తవ ధరలను పరిగణనలోకి తీసుకోకుండా ఎకరా వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్లపాటు లీజుకు కేటాయించారు. ప్రజల ఆస్తిని టిడిపి కార్యాలయానికి కారుచౌకగా కట్టబెట్టిన కలెక్టర్ చర్యను తెలుగు రాష్ట్రాల పబ్లిక్ ఫోరం కో - ఆర్డినేటర్ కాంద్రేగుల వెంకటరమణ తప్పుబట్టారు.

రెండెకరాల భూమి టిడిపి కార్యాలయ భవనానికి 33 ఏళ్లపాటు లీజుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసి ప్రభుత్వం పట్ల తన భక్తిని ప్రదర్శించుకున్నారు. జిల్లా పార్టీ కార్యాలయానికి దరఖాస్తు చేసినప్పటి నుంచి కేటాయింపు వరకు జరిగిన ప్రక్రియంతా విస్తుపోయేలా వుంది. 2024 సెప్టెంబరు 24న తాతయ్యబాబును రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ 10న ఆయన బాధ్యతలు స్వీకరించారు. కానీ, 2025 ఏప్రిల్‌లో పార్టీ కార్యాలయం కోసం దరఖాస్తు చేసేనాటికి తాతయ్యబాబు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ కానప్పటికీ ఛైర్మన్‌గా కలెక్టర్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. భూముల కేటాయింపు విషయమై కలెక్టర్ వివరణ కోసం 'ప్రజాశక్తి' ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

భూ కేటాయింపుపై దర్యాప్తు చేయాలి

నగర, పంచాయతీ పరిధిలోని పోరంబోకు వంటి ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు కేటాయింపును నిషేధిస్తూ 2012లో జగపాల్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు అన్ని రాష్ట్రాల్లో అమలుచేయాలని ఆదేశించింది. టిడిపి కార్యాలయానికి ప్రభుత్వ భూమిని కేటాయించడం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే. 2012లో ప్రభుత్వం ఆమోదించిన ప్రభుత్వ భూముల కేటాయింపు విధాన ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు ఇవ్వకూడదు. అసాధారణ పరిస్థితుల్లో, ప్రజా ప్రయోజనాల రీత్యా ఇవ్వాల్సివస్తే భూమి మార్కెట్ ధరపై 10 శాతం కంటే అద్దె తక్కువ ఉండకూడదు. రిజిస్ట్రేషన్ విభాగం వెబ్‌సైట్ ప్రకారం తుమ్మపాలలో ఎకరా కోటికి పైగావుంది. పార్టీ కార్యాలయానికి భూమి కేటాయిస్తూ కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వు అనుచితం. ఇవ్వకూడని ఉత్తర్వు ఎలా ఇచ్చారో నిష్పాక్షికంగా దర్యాప్తు చేయాలి. ప్రభుత్వ భూముల విషయంలో, ప్రజల తరపున ప్రభుత్వం ట్రస్టీ అనే విషయాన్ని విస్మరిస్తూ, జమిందార్‌గా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి.



- ఇఎఎస్.శర్మ,
విశ్రాంత ఐఎఎస్ అధికారి

ఇసుక అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

గుండాల అక్రమ ఇసుక ర్యాంపును పరిశీలించిన పీసా కార్యదర్శి, సిపిఎం నేతలు


ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-ఎటపాక : మండలంలోని గుండాల ఇసుక ర్యాంపు నుండి అక్రమంగా ఇసుక తరలింపుపై చర్యలు తీసకోవాలని గుండాల కాలనీ పీసా కమిటీ కార్యదర్శి ఇరపు అజయ్, సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. పీసా చట్టాన్ని తుంగలో తొక్కి ఇసుకను పక్క రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారని వారు విమర్శించారు. ఈ మేరకు గుండాలలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపును ఇరప అజయ్, స్థానిక సిపిఎం నాయకులు శనివారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇరప అజయ్ మాట్లాడుతూ పీసా కమిటీ అనుమతులు లేకుండా అక్రమంగా ర్యాంపులు ఏర్పాటు చేసి రాత్రి, పగలు తేడా లేకుండా గుండాల కాలనీ నుండి సెయింట్ ఆన్స్ స్కూల్ మీదుగా తెలంగాణ రాష్ట్రంలోకి ఇసుకను అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. అయినా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. యథేచ్ఛగా ఇసుక, మట్టి తవ్వకాల వల్ల రోడ్లు దెబ్బతిని గుంతలుగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి అక్రమ దందాలను కట్టడి చేయాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీనివాసు, నూతలపాటి సుధాకర్, పసుపులేటి ప్రవీణ్, మంద జగదీష్ పాల్గొన్నారు.

మన్యంలో కానరాని వేసవి తాపం!

- మండు వేసవిని మరిపిస్తున్న వరుణుడు
- నిత్యం వర్షపు జల్లులతో చల్లని వాతావరణం
- అడపాదడపా అలజడి సృష్టిస్తున్న ఈదురుగాలులు, పిడుగులు

ప్రజాశక్తి - పాడేరు : అల్లూరి మన్యంలో నిత్యం కురుస్తున్న వర్షాలు మండువేసవిని మరిపిస్తున్నాయి. మైదాన ప్రాంతాల్లో ఎండలు మండుతుంటే, అందుకు భిన్నంగా మన్యంలో నిత్యంవర్షాలతో ఆహ్లాదకరమైన చల్లని వాతావరణం నెలకొంది. శరదృతువును తలపించేలా ఉదయం పూట మంచు ముసుగు వేస్తోంది. తర్వాత ఉదయం 8 గంటల నుంచి నాలుగు గంటల వరకు భానుడు భగభగలాడుతున్నప్పటికీ, సాయంత్రానికి మబ్బులతో వర్షం పలకరించి సేదదీరుస్తుండడంతో ప్రస్తుతానికి ఎండ తీవ్రత అంతగా తెలియడం లేదనే చెప్పాలి. పాడేరు ఏజెన్సీలో ప్రస్తుతం భిన్న వాతావరణం ఉంది

. ఇక జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో శనివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. రెండు గంటలసేపు విరామం ఇచ్చి మళ్లీ మూడున్నర గంటల సమయంలో రెండోసారి వర్షం పడింది. వేసవి సీజన్ మొదలుకొని మార్చి ఏప్రిల్ నెలలో ప్రతిరోజు మధ్యాహ్నం వేళ పాడేరులో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది.ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలు దాటేసరికి కారు మబ్బులు కమ్మేసి ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తోంది. గతనెలరోజులుగా రోజూ కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఆహ్లాదంగా మారి మన్య ప్రజలకు వేసవి నుంచి పూర్తిగా ఉపశమనం కలుగుతోంది. పాడేరు ఏజెన్సీలో అరకు అనంతగిరి డుంబ్రిగూడ పెదబయలు, ముంచంగిపుట్టు, చింతపల్లి, జీకే వీధి, పాడేరు, హుకుంపేట మండలాల్లో రంపచోడవరం డివిజన్‌లోని అడ్డతీగల, కూనవరం, చింతూరు తదితర మండలాల్లో వర్షాల తాకిడి ఎక్కువగా ఉంది. జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగానే నమోదవుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 30 నుంచి 35 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు 22 నుంచి 17 డిగ్రీలు వరకు నమోదు అవుతున్నాయి. జిల్లాలోని 22 మండలాల్లో కూడా ఈ వేసవి సీజన్‌లో ఇప్పటి వరకు అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి.


పాడేరులో కురుస్తున్న వర్షం

రెండు మిల్లీమీటర్ల నుంచి 17 మిల్లీమీటర్లు వరకు వర్షపాతం నమోదు అవుతోంది. అయితే అడపాదడపా ఈదురుగాలులు, ఉరుములు మెరుపులు పిడుగులతో వాతావరణం ఒక్కోసారి బీతావహారణంగా మారిపోతోంది. పిడుగుపాటుకు పలుప్రాంతాల్లో మూగజీవాలు మృత్యువాత పడడం, ఈదురుగాలులకు పంట నష్టాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ వాయిదా

ప్రజాశక్తి-జీకే.వీధి:మండలంలోని పెదవలస పంచాయతీ డోకులూరు గ్రామంలో లేట్ రైట్ మైనింగ్ తవ్వకాల కోసం శనివారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ (పబ్లిక్ హియరింగ్) గ్రామసభ మన్యం బంద్ కారణంగా వాయిదా పడింది.డోకులూరు గ్రామంలో ఎర్రమట్టి క్వారీ తవ్వకాల కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు పెద్ద ఎత్తున అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సభకు వచ్చిన గూడెం కొత్త వీధి తహసిల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ, బంద్ కారణంగా అధికారులు రాకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని తెలిపారు.

వేసవి దుస్తుల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖపట్నంలో నోవాటెల్‌హోటల్ వేదికగా మే 3, 4వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వేసవి దుస్తుల ప్రదర్శన సూత్ర ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ప్రదర్శనను సూత్ర సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉమేష్‌మాద్యం, కె.నీలిమ, లక్ష్మీపతి, సునీతదుకార్, రచన సంచిత సంయుక్తంగా ప్రారంభించారు.ఉమేష్ మాద్యం మాట్లాడుతూ వేసవిలో అత్యంత ఉత్సాహాన్ని ఇచ్చేదుస్తులను ఈ ప్రదర్శనలో ఉంచామని వినూత్నమైన డిజైన్లతో ఉన్న వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచడం జరుగుతుందన్నారు. సంప్రదాయ, ఫ్యాషన్ దుస్తులు కూడా ఉంటాయని తెలిపారు. ప్రదర్శన ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని ప్రవేశం ఉచితమని తెలిపారు.

డాల్ఫినోస్ కాలనీలో డిఆర్‌ఎం పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :డాల్ఫినోస్ వద్ద రైల్వే కాలనీలో వాల్తేరు డివిజన్ డిఆర్‌ఎం లలిత్‌బోహ్రా ఆకస్మికంగా పర్యటించారు. పారిశుద్ధ్యం, లైటింగ్, భద్రత, రైల్వేక్వార్టర్ల పరిస్థితిని ఆయన సమీక్షించారు. అక్కడి ప్రజల వద్ద నుండి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. పలుఇళ్లు తనిఖీ చేసి సదుపాయాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. రైల్వేకాలనీలో ఎప్పటికప్పుడు ఇలాంటి తనిఖీలు చేపడతామన్నారు.

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొని బైకిస్ట్ దుర్మరణం

- సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా మృతదేహం గుర్తింపు


నాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: పెద్దమ్మ, అన్నయ్యలను చూసేందుకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో చెట్టును ఢీకొని తుప్పల్లో దూసుకుపోయి విగత జీవిగా మారి మృత్యుఒడిలోకి చేరుకున్న విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఈనెల 2న శుక్రవారం లోగిలి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే గిరిజనుడు తప్పిపోయారని బాధిత కుటుంబీకులు ఫిర్యాదు మేరకు పోలీసుల దర్యాప్తులో శనివారం ఉదయంమృతదేహాన్ని గుర్తించారు. ˆంది.. దీనికి సంబంధించి స్థానిక ఎస్ఐ పాపినాయుడు తెలిపిన వివరాలివి.

. గసభ పంచాయతీ లోగిలి గ్రామానికి చెందిన కొర్రా నాగేశ్వరరావు(38) అనే గిరిజనుడు వాళ్ల పెద్దమ్మ గ్రామం పంతలచింతకు ఈనెల 1న బైకుతో బయలు దేరి వెళ్లాడు. . తిరుగు ప్రయాణంలో స్వగ్రామం వెళ్లేందుకు అదే రోజు రాత్రి బయలు దేరిన నాగేశ్వరరావు తిరుగు ప్రయాణంలో రాత్రి వేళ అరకు- పాడేరు ప్రధాన రహదారిలోని మార్గమధ్యలో చెట్టును ఢీ కొని రైల్వే ట్రాక్ తుప్పల్లో అదుపు తప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అయితే విషయం తెలియని కుటుంబీకులు దీనిపై ఫిర్యాదు చేయగా, నాగేశ్వరరావు సెల్‌ఫోనులోని సిగ్నల్స్ ఆధారంగా లోకేషన్ ట్రేస్ చేసి, కురిడిలోని రైల్వే ట్రాక్ సమీపంలోని తుప్పల్లో ఉన్నట్లు శనివారం గుర్తించారు. పోలీసులు సిబ్బందితో చేరుకుని పరిశీలించగా తలకు గాయామై దుర్గంధంతో నాగేశ్వరరావు మృతదేహం పడి ఉంది. మృతదేహం పక్కనే ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషనుకు తరలించామన్నారు. మృతదేహాన్ని ఆరకులోయ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి వివాహమై 20 ఏళ్లు అవుతుందని, పిల్లలు లేరని తెలిపారు

బంగారు గొలుసు కోసమే దంపతుల హత్య

- దువ్వాడ జంట హత్యల కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌కాలనీలో జంట హత్యల కేసును పోలీసులు ఛేధించారు. నిందితుడు ప్రసన్నకుమార్ మిశ్రాను పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 25న సాయంత్రం జరిగిన నేరానికి సంబంధించి శనివారం నగర పోలీస్ కమిషనరేట్‌లో సిపి డాక్టర శంఖబ్రత బాగ్చి మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాలివి.

గత నెల 25న సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో దువ్వాడ, రాజీవ్‌నగర్ కాలనీలో గంపల యోగేంద్ర బాబు (66) గంపల లక్ష్మీ (58) దంపతులు దారుణహత్యకు గురయ్యారు. 112కు వచ్చిన కాల్ మేరకు దువ్వాడ సిఐ సిబ్బందితో స్థలానికి చేరుకొని, పరిశీలించగా, రక్తపు మడుగులో మృతి చెందిన దంపతులను గుర్తించారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తులో భాగంగా మృతుల కాల్ డేటాను పరిశీలించగా అందులోని ఒక నెంబరు డిలీట్ చేసి ఉండడాన్ని గమనించి, దాని ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు ప్రసన్నకుమార్ భార్య రాణి శర్మదిగా గుర్తించారు. దీనిపై ఆమెను ప్రశ్నించగా తన భర్త ప్రసన్న కుమార్ మిశ్రా ఆనెంబర్ వాడుతున్నాడని తెలిపింది. వెంటనే ప్రసన్నకుమార్ మిశ్రా కోసం గాలింపు చేపట్టగా, అతని వాహనం రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉన్నట్లు సిసి టివి ఫుటేజీ ఆధారంగా గుర్తించి అతడు పరారైనట్లు నిర్ధారించారు. ప్రత్యేక బృందాలతో గాలించగా, ఒడిశా పూరీలో శుక్రవారం రాత్రి నిందితుడిని అరెస్ట్ చేశారు.

నిందితుడిని విచారించగా, మృతురాలు గంపల లక్ష్మీ వద్ద రూ.ఐదు వేల అప్పు తీసుకున్న నిందితుడు దాన్ని తిరిగి చెల్లించేందుకు వారి ఇంటికి వెళ్లగా, లక్ష్మి మెడలోనున్న బంగారు గొలుసు చూసి, దాన్ని అమ్మితే తన అప్పులు తీరిపోతాయని భావించి దొంగలించే ప్రయత్నం చేయగా, యోగేంద్రబాబు అడ్డుకోవడంతో వారి మధ్య జరిగిన ఘర్షణలో దంపతులిద్దరినీ హతమార్చినట్లు చెప్పాడని సిపి వెల్లడించారు. నిందితుని వద్ద మృతురాలి బంగారు గొలుసు అమ్మగా వచ్చిన సొమ్ములో మిగిలిన రూ. 4,18,400 సొత్తును రికవరీ చేశామన్నారు. కేసును ఛేధించేందుకు 15మంది సిఐలు, వందమంది సిబ్బందితో పది బృందాలతో గాలింపు చేపట్టి ఛేధించామన్నారు. నిందితుడు గతంలోనూ దుబాయిలో చోరీకి పాల్పడి, ఐదేళ్లు జైలుశిక్ష అనుభవించాడన్నారు.రూ.ఐదు లక్షల అప్పులు తీర్చడానికే ఈ దారుణానికి పాల్పడ్డాడని సిపి వివరించారు.

వివాహేతర సంబంధంతోనే హత్య!

- 12 గంటల్లోనే కేసును ఛేదించిన భీమిలి పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మహిళా హత్య కేసును 12 గంటలలోపే ఛేధించి నిందితుడిని అరెస్టు చేసినట్లు నగర్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని గుర్తించారు. సిపి వెల్లడించిన వివరాలివి. ఒడిశా రాయగడ ప్రాంతానికి చెందిన క్రాంతికుమార్ తగరపువలస సమీపంలో తన భార్య పిల్లలతో నివాసముంటున్నాడు. అతనికి మారికవలసలో రెండోభార్య ఉంది.. ఈ క్రమంలో రెండో భార్య పక్కింట్లో ఉండే మృతురాలు వెంకటలక్ష్మి (38) తో సన్నిహితంగా మెలిగేవాడు. దీనిపై వివాదం రేగడంతో తన రెండోభార్యను అదే బ్లాక్ లోని మరొక ఇంటికి మార్చి, మృతురాలితో స్నేహ సంబంధాలను కొనసాగించాడు.

ఈనెల ఒకటిన రాత్రి 9గంటల సమయంలో ఫంక్షన్‌కు వెళ్లి వస్తానని ఇంట్లోంచి వచ్చిన మృతురాలితో తెన్నేటి పార్క్, బీచ్ రోడ్డు తదితర ప్రాంతాలకు వెళ్లి తిరిగి, నిందితుడు క్రాంతి కుమార్, రాత్రి ఒంటిగంట సమయంలో దాకమర్రి దరి ఫార్చ్యూన్ లేఅవుట్ ప్రాంతం వద్ద ఆమెను హత్య చేశాడ. ముందస్తుగా హత్యకు ప్లాన్ వేయడంతో మృతురాలి గొంతుకోసి, ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడు, జత బంగారు దుద్దులు, రెండు సెల్‌ఫోన్లు, హ్యాండ్ పర్సులను తీసుకొని, సాక్షాలు లేకుండా చేసేందుకు వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను మృతదేహంపై పోసి గుర్తుపట్టకుండా కాల్చి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన భీమిలి పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. కాగా నిందితుడు దివీస్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు.

నిర్వాసితుల కాలనీల స్థల సేకరణ వేగవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు కాలనీలు నిర్మించడానికి రంపచోడవరం, రాజవొమ్మంగి, గంగవరం, అడ్డతీగల మండలాలలో గుర్తించిన స్థల పరిశీలన వేగవంతం కావాలని, ఆయా స్థలాలు గృహ నిర్మాణాలకు అనువుగా ఉన్నది, లేనిదీ పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, అవసరమైన చోట భూమికి బదులు భూమి ఇవ్వడానికి గల అవకాశాలు పరిశీలించాలన్నారు. విఆర్ పురం, ఏటపాక, చింతూరు, కూనవరం ముంపు ప్రాంతాలలో ఉన్న స్ట్రక్చర్స్ పరిశీలించి వాటి విలువ నిర్ధారించాలని ఆదేశించారు. ఆయా మండలాలలో 4746 స్ట్రక్చర్స్ గుర్తించడం జరిగిందని, ఇప్పటి వరకు 3252 స్ట్రక్చర్స్ కు మాత్రమె విలువ కట్టడం జరిగిందని, మిగిలిన వాటిని త్వరగా పరిశీలించి విలువ నిర్ణయించాలని ఆదేశించారు. మరో 324 స్ట్రక్చర్స్ విలువ పున: పరిశీలించాలని ఆదేశించారు. ఈ వేడియో కాన్ఫరెన్స్ లో క్యాంప్ కార్యాలయం నుండి పర్యవేక్షకులు తిరుమల రావు, చింతూరు నుండి ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, సబ్ కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ వోల్టేజీ హెచ్చు తగ్గులతో ఇబ్బందులు

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని శబరికొత్త గూడెం గ్రామానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ గ్రామంలో నాలుగు రోజులు నుండి విద్యుత్ కాసేపు ఎక్కువగా, కాసేపు తక్కువ వస్తుందని, దాని వల్ల విద్యుత్ ఉపకారణాలు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు బిల్లులు కట్టక పోతే కఠినంగా వ్యవహరించే విద్యుత్‌శాఖ అధికారులు తమ సమస్యపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అసలే వేసవి కాలం కావడంతో కరెంటు కాసేపు లేకపోతే ఇబ్బంది పడుతుంటే రోజుల తరబడి ఇలా హైవోల్టేజీ, లోవోల్టేజీ ఉంటే ఎలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.